క్లుప్తంగా

నడిగూడెం వాసులకు డాక్టరేట్

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో గ్రంథాలయాధికారిగా పనిచేస్తున్న షేక్ సర్ఫరాజ్.. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వి.చంద్రశేఖర్‌రావు పర్యవేక్షణలో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో స్టేటస్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషనల్ రిపాజిటరీస్ డెవలప్ బై స్పెషల్ లైబ్రరీస్ ఇన్ ఇండియన్ ఎక్స్ ప్లోరేటరీ స్టడీ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఈ నెల 19న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్ ప్రదానం చేశారు. అలాగే నడిగూడెంకు చెందిన షేక్.ఫయాజ్ జర్నలిజంలో డాక్టరేట్ పొందాడు. వారిని స్థానికులు అభినందించారు.

కోదాడ రూరల్ సీఐగా ప్రతాప్ లింగం


సీఐ ప్రతాప్ లింగం

కోదాడరూరల్ : కోదాడ రూరల్ సీఐగా ప్రతాప్ లింగం గురువారం బాధ్యతలు స్వీకరించారు. మల్టీజోన్- 2 ఐజీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయన కోదాడ రూరల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రజితారెడ్డి మల్టీజోన్- 2 కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది సీఐకి స్వాగతం పలికారు. అనంతరం సీఐ లింగం మాట్లాడుతూ.. కోదాడ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పనిచేస్తానని తెలిపారు.

శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమ ఊరేగింపు


శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక హుజూర్‌నగర్, కోదాడ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.వెంకటేశ్వర్లు, ఎం.శైలజ, వి.మహేష్, వి.అరుణ, సీహెచ్.నరసింహారావు, జె.శివరామకృష్ణ, జయవాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు


రాంచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ మండల నాయకులు

గరిడేపల్లి : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును బీజేపీ గరిడేపల్లి మండల నాయకులు గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ మెంబర్ పాలిశెట్టి అంజయ్య, కన్వీనర్ అనంతు గురువయ్యగౌడ్‌లు మండలంలోని సమస్యలను రాంచందర్‌రావుకు వివరించారు.

పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగు పరచాలని వినతి

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి వాస పల్లయ్య తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగు పరచాలని కోరుతూ గురువారం నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేరేడుచర్ల మండలంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నేతలు సయ్యద్ హుస్సేన్, రజాక్, అంబటి భిక్షం, సైదులు, వెంకటేశ్వర్లు, లక్ష్మి, పావని, రేష్మ, శ్యామల, నాగేందర్ తదితరులు ఉన్నారు.

మల్టీపర్పస్ వర్కర్లకు బీమా చేయించాలి

చిలుకూరు : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లకు గ్రామ పంచాయతీ నిధుల నుంచి బీమా చేయించాలని ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. గురువారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ నిధులను సక్రమంగా వినియోగించి గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు.

ఉపాధి పనుల జాతరను ప్రారంభించాలి

గ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం వంద శాతం పూర్తి చేయాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు, ఏపీఓ నిర్మల, హౌసింగ్ ఏఈ లలిత, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వరదలొచ్చి.. రాకపోకలు నిలిచి

- వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు

నడిగూడెం : మండల కేంద్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంతా అతలాకుతలమైంది. బస్టాండ్ వెంట ఉన్న చౌదరి చెరువు ఇంకా అలుగు పోస్తూనే ఉంది. వర్షాల సమయంలో ఎస్సీ, బీసీ కాలనీలు నీట మునగడంతో రత్నవరం రహదారికి రెండు చోట్ల గండ్లు పెట్టారు. వరద ఉధృతి తగ్గి ఇటీవల నిర్మించిన వంతెన కింది నుంచి నీరు వెళ్తున్నాయి. అయినా రోడ్డుకు ఇంకా మరమ్మతులు చేపట్టలేదు. ఎస్సీ, బీసీ కాలనీల మధ్య ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఆయా మార్గాల్లో గత వారం రోజులుగా ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇంకా పలు ఇళ్లు బురదమయంగానే ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వాగుపై ఉన్న పలు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని, రత్నవరం రహదారికి పెట్టిన గండ్లు పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.


నడిగూడెంలో రత్నవరం రహదారికి పెట్టిన గండ్లు పూడ్చని అధికారులు


ఎస్సీ, బీసీ కాలనీల మధ్య దెబ్బతిన్న కల్వర్టు

యూరియా ఎమ్మార్పీకే విక్రయించాలి


మునగాలలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మునగాల : యూరియాను ఎమ్మార్పీకే విక్రయించాలని తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని మనగ్రోమోర్ సెంటర్‌ను మండల వ్యవసాయాధికారి బుంగా రాజు, ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్స్‌ను పరిశీలించారు. యూరియా ఎమ్మార్పీ రూ.266కే కొనుగోలు చేస్తున్నారా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఓ రాజు మాట్లాడుతూ.. యూరియా కొరత కారణంగా రైతులు నానో యూరియా ప్లస్‌ను వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం మండలంలో 1120 బాటిళ్ల నానో యూరియా అందుబాటులో ఉందని, కొక్కిరేణి, మునగాల, తాడువాయి, ఆకుపాముల సొసైటీలలో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో మన గ్రోమోర్ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగించాలి

మునగాల : పంటలకు నానో యూరియా ప్లస్‌ను వినియోగించాలని ఏఓ బుంగా రాజు కోరారు. గురువారం మండల కేంద్రంలోని పిట్టల శ్రీను వరిపైరుకు నానో యూరియా పిచికారీ చేయించి క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నానో యూరియా ప్లస్ వాడకం వల్ల పంట దిగుబడి, నాణ్యత పెరుగుతుందని తెలిపారు. ఒక ఎకరానికి అరలీటరు నానో యూరియా ప్లస్‌ను ఒకసారి పిచికారీ చేస్తే సరిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ రమ్యతేజ, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ సభ్యత్వ నమోదు


సభ్యత్వాలు అందజేస్తున్న సత్యనారాయణ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలోని పాఠశాలల్లో గురువారం ఎస్‌టీయూ సభ్యత్వ నమోదును ఎస్‌టీయూ రాష్ట్ర నాయకుడు కేవీ సత్యనారాయణ ప్రారంభించి సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కరువుభత్యం బకాయిలు చెల్లించి వేతన సవరణ అమలు చేయాలని కోరారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, మాభాషా, శ్రీనివాసరావు, పి.అంజయ్య, నరసింహారావు, విజయకుమార్, జె.జయరాం, కళింగరెడ్డి, పి.రాంబాబు, ఆర్.వీరనారాయణ, కె.వెంకటేశ్వరరావు, మురళి, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలను విజయవంతంగా నిర్వహించాలి

మఠంపల్లి : మండలంలోని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 25, 26 తేదీలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడలను విజయవంతంగా నిర్వహించాలని మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటాచారి కోరారు. గురువారం మఠంపల్లిలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పీడీలు, పీఈటీలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 25న పెదవీడు ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్- 17 బాలుర విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు, 26న మఠంపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో అండర్- 14, అండర్- 17 బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పీడీలు సునీత, ఉపేందర్‌రెడ్డి, నరేష్, శివనాగరాజు, జయ, నాగరాజు, పీఈటీలు కాశీలక్ష్మి, వీరస్వామి, వెంకటరత్నం, ఉపేందర్, సురేందర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రత్నవరం క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏఈఓగా గాయత్రి

నడిగూడెం : మండలంలోని రత్నవరం క్లస్టర్ ఇన్‌చార్జ్ వ్యవసాయ విస్తరణాధికారిగా గరిడేపల్లి గాయత్రి ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ.. రత్నవరం రైతు వేదికలో రైతులకు అందుబాటులో ఉంటానని, సమస్యలపై రైతులు తనను సంప్రదించవచ్చన్నారు.

బియ్యం, నగదు అందజేత

మఠంపల్లి : మండలంలోని కృష్ణాతండాకు చెందిన భూక్యా రాజు, అరుణ దంపతులు తమ కుమారుడు సాయిరాం పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం స్థానిక నిరుపేద వృద్ధులు, వికలాంగులకు 1. 25 క్వింటాల బియ్యం అందజేశారు. కోదాడలోని శనగల అనాథ ఆశ్రమానికి రూ.5 వేలు నగదు, 50 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో శంకర్‌నాయక్, కృష్ణానాయక్, శ్రీనునాయక్, బాలాజీ, రవి, చీనా, తావ్రూ, లింగా, భజన్, జేత్యా, నాగరాజు, సి.సాయి, జగ్గునాయక్, చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్ సరితను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

నడిగూడెం : నడిగూడెం తహసీల్దార్ వి.సరిత ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ తహసీల్దార్ పురస్కారం అందుకున్నారు. దీంతో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సరితను రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు వరికల రమేష్, ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సు, డీలర్లు సామ్యూల్ చారి, వాసు, మాధవి, ధనయ్య, రామచంద్రయ్య, కిన్నెర ఉపేందర్ పాల్గొన్నారు.

నేడు నానో యూరియా వాడకంపై అవగాహన

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నానో యూరియా వాడకంపై, డ్రోన్‌ల వాడకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాయపు దేవప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన రైతులు సకాలంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మునగాల : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గణేష్ ఉత్సవ కమిటీలు పోలీస్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రతి వినాయక మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపం ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అన్నారు. నిర్దేశించిన ప్రాంతంలో, నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు రోడ్డు పనులకు శంకుస్థాపన

మోతె : మండల పరిధిలో నామవరం నుంచి సీతానాగారం గ్రామాల మధ్య బీటీరోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వాగు మరమ్మతులకు రూ.4 కోట్ల ప్రతిపాదనలు

నడిగూడెం : మండల కేంద్రంలోని వాగు మరమ్మతుల కోసం రూ.4 కోట్లు అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు నీటి పారుదల శాఖ నడిగూడెం ఏఈ కె.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో వాగులో పూడిక తీయడంతో పాటు బస్టాండ్ సెంటర్ వద్ద డబుల్ లైన్ వంతెన, గ్రామంలో ఐదు చోట్ల సింగిల్ వంతెనలను నిర్మించనున్నట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా కోట బురుజు


కూలుతున్న కోట బురుజు

మునగాల: మండల పరిధిలోని తాడువాయి గ్రామ నడిబొడ్డున గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న పురాతన కోట బురుజు కూలేందుకు సిద్ధంగా ఉంది. దశాబ్దాల క్రితం నిర్మించిన కోట బురుజుపై పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడమే కాక వర్షాలకు నాని కూలుతోంది. పెద్ద రాళ్లతో నిర్మించిన కోట బురుజు వర్షాలకు కూలుతుండడంతో చుట్టుపక్కల ఉండేవారు భయాందోళనకు గురవుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే కోట బురుజును తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెస్టిసైడ్ దుకాణంలో తనిఖీ

మఠంపల్లి : మండలంలోని వరదాపురంలో పెస్టిసైడ్ దుకాణాలు, భీల్యానాయక్‌తండాలోని పీఏసీఎస్ గోదాములో ఏడీఏ రవికుమార్ గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను, యూరియా నిల్వలను పరిశీలించారు. రైతులకు సరిపడా నాణ్యమైన ఎరువులు, పెస్టిసైడ్ మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, ఏఈఓ సునీత, సీఈఓ తిరుపతయ్య, కంప్యూటర్ ఆపరేటర్ షేక్ జమీర్, దుకాణాల యజమానులు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు మార్చిన వ్యక్తిపై కేసు

గరిడేపల్లి: రెవెన్యూ రికార్డులను మార్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గరిడేపల్లి ఎస్‌ఐ చలికంటి నరేష్ గురువారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామ రెవెన్యూ పరిధిలో రమావత్ నాగమణి అనే మహిళకు సర్వే నంబర్ 59లో వ్యవసాయ భూమి ఉంది. 2010-2011 రెవెన్యూ పహాణీలో భూక్య శంకర్ అనే వ్యక్తి నాగమణి పేరును వైట్‌నర్‌తో తొలగించి తన పేరును పట్టాదారు కాలంలో రాసుకొని మోసచేశాడని తహసీల్దార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బోనమెత్తిన పెంచికల్‌దిన్న


బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో గురువారం ముత్యాలమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను తలపై పెట్టుకొని డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం, గాజులు, చీర, పసుపు, కుంకుమ సమర్పించారు. గ్రామస్తులు అమ్మవారికి కోళ్లు, యాటలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

మేళ్లచెరువు శివాలయంలో మాస కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్వామివారి మాసకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యావచనము, మహన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు మేళతాళాలతో అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయ శర్మ, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న ఎస్‌ఐ రవీందర్

నేరేడుచర్ల : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ నాయక్ అన్నారు. గురువారం నేరేడుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

ఆర్ కృష్ణయ్య సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేద్దాం

కోదాడరూరల్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీసీ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్య చేపట్టబోయే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేద్దామని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కోదాడలో సత్యాగ్రహ దీక్ష కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, నరేష్, నవీన్, నాగరాజు, నాగేశ్వరరావు, పరశురాం, మధు, మహేష్, వెంకటేష్, యశ్వంత్‌నాయుడు ఉన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ జాతర


ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణుల ప్రదర్శన


ప్రభబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ముత్యాలమ్మ జాతరలో భాగంగా గురువారం కనకదుర్గమ్మ పండుగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు, ప్రజలు ప్రభ బండ్లను అందంగా అలంకరించి వాటిని ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై కట్టి మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు చేశారు. ఆలయం ముందు విశ్వబ్రాహ్మణుల వీరంగం, ఖడ్గం చెప్పడం భక్తులను ఆకట్టుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐ మోహన్‌బాబు ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సీఐటీయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఒకపక్క లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుంటే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరోపక్క జీఓ నంబర్ 282 తెచ్చి పది గంటల పని విధానాన్ని అమలు చేయడం అన్యాయమన్నారు. ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రంలో నడపకుండా అదనపు సెంటర్లలో నడపాలని ఉత్తర్వులు జారీ చేయడం అంగన్‌వాడీలను బాధ్యతల నుంచి తప్పించటమేనని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో పూట గడవని పరిస్థితుల్లో జీవితాలు కొనసాగిస్తున్నారని వారిని ఆదుకోవాలని కోరారు. ఈనెల 29న నిర్వహించబోయే కలెక్టర్ ముట్టడిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు కె.వెంకటనారాయణ, శీలం శ్రీను, వై.సోమయ్య, ఎస్.రాధాకృష్ణ, వి.సైదులు, దుర్గారావు, మల్లన్న, తిరుపతన్న తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సమస్యలపై ఉద్యమిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య

నేరేడుచర్ల : రిటైర్డు ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి జేఏసీ ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య తెలిపారు. గురువారం నేరేడుచర్లలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో నిర్వహించిన నేరేడుచర్ల, పాలకీడు మండలాల రిటైర్డు ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా పీఆర్‌సీ అమలు చేయలేదని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 11 విశ్రాంతి ఉద్యోగుల భవనాలు నిర్మించినట్లు తెలిపారు. గత ఎనిమిది నెలలుగా భవనంలో సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌రావు, సోమయ్య, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, సుందరయ్య, వెంకటరమణరావు, రంగారెడ్డి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, కళాజాతా బృందం

మునగాల : సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని ఎంపీడీఓ కుంటల రమేష్‌దీనదయాళ్ అన్నారు. గురువారం మండలంలోని తాడువాయి గ్రామ పరిధిలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై ఆటపాటలతో ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కలకవలోనూ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు డి.రామునాయక్, దొంగరి సైదులు, పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి, ఏఎన్ఎం సుచరిత, తెలంగాణ సాంస్కృతిక సారధి టీమ్ లీడర్ వెన్నెల నాగరాజు, సభ్యులు ఈర్ల సైదులు, వేముల శ్రవణ్, మేడిపల్లి వేణు, చల్లా లక్ష్మి, ప్రియాంక, స్రవంతి, శిరీష, ప్రియదర్శిని, ఇంద్రజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

కోదాడరూరల్ : రాష్ట్రానికి యూరియాను అందించడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నెం పాపిరెడ్డి విమర్శించారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడి రైతులు పంటలు సాగు చేసుకుంటుంటే వారికి కావాల్సిన యూరియాను అందించకుండా కేంద్రం ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. బీజేపీ నాయకులు రాష్ట్రానికి కేటాయించాల్సిన యూరియా దిగుమతి చేసేవిధంగా కేంద్ర పెద్దలతో మాట్లాడాలని ఆయన సూచించారు.

ఎస్‌ఐ మోహన్‌బాబుకు కాంగ్రెస్ నాయకుల సత్కారం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నూతన ఎస్‌ఐ బండి మోహన్‌బాబును స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ అజీజ్ పాషా, అట్లూరి హరిబాబు, జక్కుల మల్లయ్య, గల్లా వెంకటేశ్వర్లు, సమ్మెట సుబ్బారాజు, చెన్నం శ్రీనివాస్, కోల మట్టయ్య, ముషం సత్యనారాయణ, పి.రామ్మూర్తి, బొద్దు గోవిందరావు, చింత్రియాల నాగయ్య, మీసాల శరత్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న శ్రీనివాస్ దంపతులు

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో ఉన్న శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో గురువారం మునగాల మండల కేంద్రానికి చెందిన కాసర్ల శ్రీనివాసరావు, కల్పన దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిమందిరం నిర్వాహకులు దేవినేని రవికుమార్, ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మండల విద్యాధికారి ఉపేందర్‌రావు

నడిగూడెం : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు ఆదేశించారు. గురువారం మండలంలోని రామాపురం ఎస్సీ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకపోతే చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను హెచ్చరించారు.